
సాక్షి
కాకినాడ
సోమవారం । 31 । జూలై । 2023



రూ.1,00,120 విరాళం

తుని రూరల్: లోవ దేవస్థానంలో మహామంటపం నిర్మాణానికి కడలి శ్రీనివాసరావు, సాయి రమాదేవి దంపతులు (రాజోలు) ఆదివారం రూ.1,00,120 విరాళం సమర్పించారు.



డెల్టాలకు 10,700 క్యూసెక్కులు

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు ఆదివారం గోదావరి నీటి విడుదలను పెంచారు. మొత్తం 10,700 క్యూసెక్కులు వదిలారు. తూర్పు డెల్టాకు 4 వేలు, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.

గురు సాక్షాత్ విద్యార్థి!



పాఠశాలలకు దిశానిర్దేశం చేసే ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు ఆవశ్యకం. అందుకే పాఠశాల విద్యాశాఖ వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ అందజేస్తోంది. 8లో

న్యూస్‌రీల్

ఏలేరులోకి 800 క్యూసెక్కులు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: కొద్ది రోజులుగా **పరీవాహక ప్రాంతంలో** కురుస్తున్న వర్షాలతో **ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు స్వల్పంగా పెరిగాయి.** జలాశయంలోకి ఆదివారం 800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, ప్రస్తుతం 76.02 మీటర్లుగా నమోదైంది. సామర్థ్యం 24.11 టీఎంసీలకు గాను 9.24 టీఎంసీల మేర నీటినిల్వలున్నాయి. ఆయకట్టుకు 600, విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

చీలిక పెదవి శస్త్రచికిత్సలు పూర్తి

కాకినాడ క్రైం: మిషన్ స్మైల్ ఆధ్వర్యాన ముత్తూట్ పేపాచన్ సహకారంతో కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహించిన చీలిక పెదవి శస్త్రచికిత్సలు ఆదివారం ముగిశాయి. మలిదశలో భాగంగా జరిగిన ఈ మూడు రోజుల ప్రక్రియలో మొత్తం 34 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ విష్ణువర్ధన్‌ల పర్యవేక్షణలో ఈ శస్త్రచికిత్సలు చేశారు. ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అతిథిగా పాల్గొన్నారు. మిషన్ స్మైల్ బృందాన్ని అభినందించారు. తిరుపతి, విజయనగరం ఆస్పత్రుల్లో కూడా చీలిక పెదవి శస్త్రచికిత్సలు నిర్వహించాలని కోరారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో వందలాది మంది బాలల జీవితాలు వికసిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ, అనస్థీషియా నిపుణులతో పాటు మిషన్ స్మైల్ వైద్య బృందం, బాలల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల విడిభాగాలకు 2న వేలం

కాకినాడ క్రైం: పాడయిన ప్రభుత్వ పోలీసు వాహనాల విడిభాగాల విక్రయానికి వచ్చే నెల 2వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) అదనపు ఎస్పీ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఆవరణలో ఈ వేలం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు మోటార్ ట్రాన్స్‌పోర్టు అధికారి ఆర్ఐ అప్పారావును 94407 96553 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

నేడు స్పందన

స్పందన
ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం, జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అలాగే మంగళవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను 1800 425 3077 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తనకు నేరుగా తెలియజేయవచ్చని ఆమె తెలిపారు.

వ్రతఫలం దక్కింది

- వ్రత పురోహితుల గ్రాట్యుటీని పెంచిన ప్రభుత్వం
- ఇప్పటి వరకూ ఇస్తున్నది రూ.లక్షే..
- ఇక నుంచి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లింపు
- అన్నవరం దేవస్థానంలో 260 మందికి మేలు



అన్నవరం దేవస్థానం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వ్రత పురోహితులకు శుభవార్త. ఇక నుంచి పదవీ విరమణ చేసిన అనంతరం వారు దేవస్థానానికి సేవలందించిన సంవత్సరాలు లెక్క కట్టి ఆ మేరకు ఏడాదికి రూ.10 వేల చొప్పున గ్రాట్యుటీ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఎన్ని సంవత్సరాలు సేవలందించినా రూ.లక్ష మాత్రమే గ్రాట్యుటీ చెల్లిస్తున్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం 40 సంవత్సరాలు సేవలందించి, పదవీ విరమణ చేసిన పురోహితులకు ఇక నుంచి గ్రాట్యుటీగా రూ.4 లక్షలు చెల్లిస్తారు. దీనివలన దేవస్థానంలోని 260 మంది పురోహితులకే మేలు చేకూరనుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పదవీ విరమణ చేసిన పురోహితులకు తాజా ఉత్తర్వులు వర్తిస్తాయని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.

ఏటా 7 లక్షల వ్రతాలు.. రూ.35 కోట్ల ఆదాయం

ఉభయ తెలుగు రాష్ట్రాలల్లో సత్యదేవుని వ్రతమాచరించని హిందువుల ఇల్లు ఉండదంటే అతిశయోక్తి కాదు. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా సత్యదేవుని వ్రతమాచరించడం తప్పనిసరి. వివాహం చేసుకున్న నవదంపతులు పెళ్లి దుస్తులతో రత్నగిరికి చేరుకుని స్వామివారి వ్రతాలాచరిస్తారు. అలాగే ఏడాదికి కనీసం ఒకసారైనా కుటుంబ సమేతంగా అన్నవరం వచ్చి, స్వామివారి వ్రతం ఆచరిస్తారు. ఈవిధంగా దేవస్థానంలో ఏటా సుమారు 7 లక్షల వ్రతాలు జరుగుతున్నాయి. రూ.300, రూ.800, రూ.1,500, రూ.2 వేల టిక్కెట్లపై ఈ వ్రతాలు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా దేవస్థానానికి ఏటా రూ.35 కోట్లు పైగా ఆదాయం వస్తోంది.

నాలుగు తరగతులుగా..

అన్నవరం దేవస్థానంలో నాలుగు తరగతులుగా పురోహితులు సేవలందిస్తున్నారు. స్పెషల్‌గ్రేడ్ 12 మంది, మొదటి తరగతి 48 మంది, రెండు, మూడు తరగతుల్లో 100 మంది చొప్పున పురోహితులు ఉన్నారు. వీరికి వ్రతాల ఆదాయంలో 40 శాతం మొత్తాన్ని పారితోషికంగా దేవస్థానం చెల్లిస్తోంది. వీరికి వరుసగా నెలకు రూ.40 వేలు, రూ.37 వేలు, రూ.35 వేలు, మూడో తరగతి వారికి రూ.25 వేల నుంచి రూ.31 వేల వరకూ పారితోషికం చెల్లిస్తున్నారు. ప్రతి నెలా ఈవిధంగా చెల్లించిన అనంతరం మిగిలిన మొత్తాన్ని సంవత్సరం చివరిలో ఎరియర్స్ రూపంలో అందరికీ సమానంగా చెల్లిస్తున్నారు. వీరు 65 సంవత్సరాల తరువాత పదవీ విరమణ చేస్తారు.

గతంలో స్వల్పమే..

గతంలో ఎన్ని సంవత్సరాలు సేవలందించినా పదవీ విరమణ అనంతరం పురోహితులకు రూ.లక్ష మాత్రమే గ్రాట్యుటీగా చెల్లించేవారు. చివరి నెల పారితోషికంలో సగం మొత్తం పెన్షన్‌గా పొందేవారు. అయితే దేవస్థానం ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే గ్రాట్యుటీ రూ.10 లక్షలకన్నా ఎక్కువ వస్తోంది. దీంతో పురోహితులు తమకు కూడా సర్వీసు ఆధారంగా గ్రాట్యుటీ ఇవ్వాలని దేవదాయ శాఖ కమిషనర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో సేవలను అనుసరించి పురోహితులకు ఏడాదికి రూ.10 వేల చొప్పున గ్రాట్యుటీ ఇవ్వాలని గత ఏప్రిల్‌లో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

తాజా ఉత్తర్వుల ప్రకారం ముగ్గురికి చెల్లింపు

దేవస్థానంలో ఇద్దరు పురోహితులకు తాజా ఉత్తర్వుల ప్రకారం గ్రాట్యుటీ చెల్లించారు. కల్యాణ బ్రహ్మ ముత్య సత్యనారాయణశర్మ, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు ప్రయాగ వేంకట రమణలు 47 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి, గత ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. వారికి గ్రాట్యుటీగా రూ.4.70 లక్షల చొప్పున దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శనివారం చెక్కులు అందజేశారు. అలాగే 11 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి, ఏప్రిల్‌లో పదవీ విరమణ చేసిన ఇల్వకుర్తి జయరామ్‌కు కూడా రూ.1.10 లక్షల చెక్కు అందించారు.

సముచిత నిర్ణయం



వ్రత పురోహితుల గ్రాట్యుటీ పెంపు ఎంతో సముచితమైన నిర్ణయం. గ్రాట్యుటీ పెంచాలని పురోహితులు కోరిన వెంటనే కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపించాం. వారు వెంటనే తగిన ఆదేశాలిచ్చారు.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం



ఎంతో మేలు



తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 260 మంది పురోహితుల కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇటువంటి నిర్ణయం తీసుకోలేదు. 2023 ఏప్రిల్‌కు ముందు పదవీ విరమణ చేసిన పురోహితులు సుమారు 40 మంది ఉన్నారు. వీరికి పదవీ విరమణ సమయంలో గ్రాట్యుటీ రూ.లక్ష మాత్రమే ఇచ్చారు. వీరికి కూడా మరో రూ.లక్ష అదనంగా అందజేయాలని కోరగా కమిషనర్ సత్యనారాయణ సానుకూలంగా స్పందించారు. ఇది కూడా అమలైతే మరో 40 మంది విశ్రాంతి పురోహితులకు లబ్ధి చేకూరుతుంది. అలాగే, పురోహితుల పారితోషికాన్ని ఏటా రూ.వెయ్యి, విశ్రాంత పురోహితుల పెన్షన్‌ను ఏటా రూ.500 పెంచాలని గతంలో ఆదేశించారు. పురోహితుల పారితోషికం పెంచుతున్నారు కానీ విశ్రాంత పురోహితులకు పెరగడం లేదు. దీనిని కూడా పరిశీలించాలి.

– నాగాభట్ల కామేశ్వరశర్మ, వ్రతబ్రహ్మ, విశ్రాంత వైదిక సలహాదారు

చాలా సంతోషం



వ్రత పురోహితునిగా 47 సంవత్సరాలు సేవ చేసి, గత ఏప్రిల్ నెలాఖరున పదవీ విరమణ చేశాను. రూ.4.70 లక్షల గ్రాట్యుటీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. గ్రాట్యుటీ పెంచినందుకు కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ అజాద్‌లకు కృతజ్ఞతలు.

– ముత్య సత్యనారాయణ, విశ్రాంత కల్యాణబ్రహ్మ

లోవలో భక్తుల రద్దీ



లోవ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

తుని రూరల్: ఆషాఢ మాసం ముగిసినా తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానానికి భక్తుల తాకిడి తగ్గడం లేదు. అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన 40 వేల మంది భక్తులు క్యూలో అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,38,005, పూజా టికెట్లకు రూ.2,97,250, కేశఖండన శాలకు రూ.20 వేలు, వాహన పూజలకు రూ.6,180, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదులు అద్దెలుగా రూ.1,07,432, దాతల విరాళాలుగా రూ.2,85,212 కలిపి మొత్తం రూ.9,54,779 ఆదాయం సమకూరిందని వివరించారు.

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. పంచామృతాభిషేకం, ప్రత్యేక అభిషేకాల్లో 42 మంది భక్తదంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 305 మంది భక్తులు, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 20 మంది భక్తదంపతులు పాల్గొన్నారు. 22 మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా దేవస్థానానికి రూ.1,44,296 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

చదువులపై మదింపు

- రేపటి నుంచి ఎఫ్ఏ, సీబీఏ-1 పద్ధతిలో పరీక్షలు
- 1 నుంచి 8 తరగతులకు ఓఎంఆర్ బేస్డ్ విధానం
- 9, 10 తరగతుల విద్యార్థులకు ఫార్మేటివ్
- ఈసారి కొత్తగా టోఫెల్ పరీక్షల పరిచయం
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 2.73 లక్షల మంది

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థుల అభ్యసన మదింపు, సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యా శాఖ ఏటా పరీక్షలు నిర్వహించడం పరిపాటి. గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను ప్రభుత్వం గత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) పేరుతో నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరం 4 ఫార్మేటివ్, 2 సమ్మేటివ్ పరీక్షల నిర్వహణకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది మాదిరిగానే 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ, 9, 10 తరగతుల వారికి ఫార్మేటివ్ విధానాల్లో పరీక్షలు నిర్వహిస్తారు.

సామర్థ్యాల వెలికితీతే ఉద్దేశం

ప్రస్తుత విద్యా సంవత్సరం జూన్ 12న ప్రారంభమైంది. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు జరుపుతున్నారు. జూన్, జూలై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపునకు సీబీఏ, ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా అభ్యసన లోపాలను గుర్తిస్తారు. విద్యార్థులు వెనుకబడిన అంశాలను గుర్తించి, ప్రత్యేక బోధన ద్వారా వారు సాధారణ స్థాయికి చేరేలా చూస్తారు.

సీబీఏ విధానం ఎందుకంటే..

విద్యార్థుల్లో ఉత్తమ విద్యా ప్రమాణాలను పెంచే క్రమంలో సీబీఏ విధానాన్ని అమలు చేస్తున్నారు. పక్కా బోధనతో విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయడమే ఈ పరీక్షల ప్రధాన ఉద్దేశం. ఎఫ్ఏ, ఎస్ఏల స్థానంలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ-1, 3, ఎస్ఏ-2కు బదులు సీబీఏ విధానంలో, ఎఫ్ఏ-2, 4, ఎస్ఏ-1 పరీక్షలు పాత విధానంలో నిర్వహిస్తారు. 9, 10 తరగతులకు నాలుగు ఎఫ్ఏలు, రెండు సమ్మేటివ్ పరీక్షలు ఫార్మేటివ్ విధానంలో అమలు చేస్తారు.

బైలింగ్వల్ ప్రశ్నపత్రాలు

సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు ప్రశ్నపత్రం బైలింగ్వల్ (ద్విభాష) విధానంలో ఉంటుంది.

విద్యార్థికి ఇంగ్లిషులో ప్రశ్న అర్థం కాకుంటే తెలుగులో చదివి అర్థం చేసుకునేందుకు గత ఏడాది నుంచి బైలింగ్వల్ ప్రశ్నపత్రాలు ప్రవేశపెట్టారు. ఇందులో 10 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో, ఐదు ప్రశ్నలు రాతపూర్వక విధానంలో ఇస్తారు. మొత్తం 15 ప్రశ్నలకు 20 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నలన్నీ విద్యార్థిని సమగ్రంగా అంచనా వేసేలా ఉంటాయి. మెకానికల్, అండర్‌స్టాండింగ్, అప్లికేషన్ (ఎంయూఏ) ప్రశ్నపత్రం ఉంటుంది. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది. సీబీఏ విధానంలో పరీక్షలు రాసే విద్యార్థులు తమ సమాధానాలను ఓఎంఆర్ షీట్లలో నింపాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మాత్రం రాతపూర్వక సమాధానాలు రాస్తే సరిపోతుంది.

యాజమాన్యాలు, తరగతుల వారీగా జిల్లాలో విద్యార్థుల వివరాలు

తరగతి	ప్రభుత్వ	ప్రైవేటు	మొత్తం
1	6529	11797	18326
2	9064	12503	21567
3	10682	14399	25081
4	14288	16079	30367
5	16548	14852	31400
6	15636	12087	27723
7	18801	12023	30824
8	20270	9411	29681
9	20456	8770	29226
10	20658	8269	28927



5 వరకూ నిర్వహణ

సీబీఏ విధానంలో నిర్వహించే పరీక్షలు ఆగస్టు 1 నుంచి 5వ తేదీ వరకూ నిర్వహిస్తారు. ఎయిడెడ్, ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లో 1,52,932 మంది, ప్రైవేటు యాజమాన్యంలో 1,20,190 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. కాగా సీబీఏ విధానంలో 1-8 తరగతుల వరకూ 2,14,969 మంది, పాత విధానంలో 9, 10 తరగతులకు చెందిన 58,153 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

తొలిసారిగా టోఫెల్

ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఎ ఫారిన్ లాంగ్వేజ్(టోఫెల్)ను విద్యార్థులకు పరిచయం చేసింది. ఆడియో అండ్ ప్రాక్టీస్ పేపర్లను మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకూ అమలు చేశారు. ప్రపంచ స్థాయి ఇంగ్లిష్‌ను పరిచయం చేయడం ద్వారా భవిష్యత్‌లో విద్యార్థులు గ్లోబల్ పోటీని తట్టుకునే విధంగా తీర్చిదిద్దడం టోఫెల్ లక్ష్యం. ఇప్పటికే పాఠశాలలకు ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ టీవీ, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) డిస్‌ప్లే ద్వారా విద్యార్థులకు సులభమైన రీతిలో ఇంగ్లిష్‌ను నేర్పిస్తున్నారు. 3, 4, 5, 6, 7 తరగతులను ప్రైమరీ స్థాయిగా, 8, 9 తరగతులను జూనియర్ స్థాయిగా పేర్కొంటున్నారు. ఇప్పుడు ఫార్మేటివ్ పరీక్షలతో పాటుగా టోఫెల్ పరీక్షలను కూడా ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు ఉన్నచోట మాత్రమే టోఫెల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు



పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. వీటిని కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య మండల కేంద్రాలకు చేర్చాం. పరీక్ష పేపర్లకు ఎంఈఓలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని మార్గదర్శకాలనూ ఎంఈఓలు, హెచ్ఎంలకు జారీ చేశాం.

– డి.వెంకట్రావు, డీసీఈబీ కార్యదర్శి, కాకినాడ

కొత్త విధానంపై అవగాహన



గత విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్న సీబీఏ విధానంపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉంది. ఈ ఏడాది కొత్తగా టోఫెల్ పరీక్ష అమలు చేస్తున్నాం. దీనిపై కూడా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశాం. – జి.నాగమణి, ఆర్‌జేడీ, ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ

'కండ్లకలక'లం

- జిల్లాలో వ్యాప్తి చెందుతున్న వ్యాధి
- ఆరు రోజుల్లో 909 కేసులు
- వాతావరణ మార్పులు, అజాగ్రత్తే కారణమంటున్న వైద్యులు



కండ్లకలకతో ఎర్రబడిన కన్ను

కాకినాడ క్రైం: వాతావరణంలో వస్తున్న అసాధారణ మార్పులతో జిల్లాలో కొద్ది రోజులుగా కండ్లకలక వ్యాప్తి చెందుతోంది. వ్యాధి సోకిన వారి అజాగ్రత్త కూడా తోడవడంతో బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. గత సోమవారం నుంచి శనివారం వరకూ జిల్లాలో 909 కండ్లకలక కేసులు నమోదయ్యాయి. ప్రతి రోజూ కాకినాడ జీజీహెచ్‌లో కంటి వైద్యం ఓపీకి 150 మందికి పైగా వస్తున్నారు. వీరిలో కనీసం 40 మంది కండ్లకలక బాధితులుంటున్నారు. గడచిన శుక్రవారం ఒక్క రోజే జీజీహెచ్ ఓపీలో 62 కండ్లకలక కేసులు నమోదయ్యాయి.

ఈ వ్యాధి ఒక వ్యక్తి నుంచి కనీసం ఆరుగురికి వ్యాప్తి చెందుతుందని గణాంకాలు చెబుతున్నాయి. బాధితులు బాధ్యతగా వ్యవహరిస్తే కండ్లకలక వ్యాప్తిని అరికట్టడం సునాయాసమేనని వైద్యులు అంటున్నారు. అంటువ్యాధి అయిన కండ్లకలక గాలిలో తేమ కారణంగా కూడా త్వరితగతిన వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వలన కంటి లోపల ఉండే పారదర్శక పార ప్రభావితమవుతుంది. వైరస్, బ్యాక్టీరియాలతో పాటు పుప్పొడి, రసాయనాలు కూడా కండ్లకలకకు కారణమవుతాయి.

ఇవీ లక్షణాలు

మొదట కన్ను లోపలి భాగం ఎర్రగా మారుతుంది. కన్ను వాపు వస్తుంది. దురదగా అనిపిస్తుంది. కంటి నుంచి అదే పనిగా నీరు కారుతుంది. కళ్లు పుసులు కట్టడం, తెరవలేనంతగా మూసుకుపోవడం, కంటి నొప్పి కండ్లకలక లక్షణాలు.

నివారించడమిలా..

- కోవిడ్ తరహాలో ఐసోలేషన్, భౌతిక దూరంతో ఈ వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు.
- కండ్లకలక వచ్చిన కళ్లను నేరుగా చేతితో తాకడం, నలపడం చేయకూడదు.
- తడి వస్త్రం లేదా దూది ఉండలతో కళ్లను శుభ్రం చేసుకోవాలి.
- కండ్లకలక ఉంటే రోజుకు కనీసం ఆరుసార్లు 20 సెకన్ల పాటు సబ్బు నీటితో శుభ్రం చేయాలి. సబ్బు రసాయనాలు కంటి లోపలకు వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఆ వెంటనే చేతులను వేడి నీటితో కడగాలి.
- బాధితులు వాడే దిండ్లు, దుప్పట్లు, తువ్వాళ్లు, రుమాళ్లు, సబ్బులను మరెవ్వరూ వాడకూడదు.
- తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా కళ్లను పూర్తిగా కప్పి ఉంచే కళ్లద్దాలు ధరించాలి.

ఒక్కసారిగా ఎందుకు పెరిగాయంటే..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని ఎపిడమాలజిస్టుల విశ్లేషణ ప్రకారం.. వాతావరణంలో అసాధారణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది వేసవి అతి తీవ్ర వేడిమి, వడగాలులతో సుదీర్ఘంగా కొనసాగింది. వర్షాకాలంలో కొంత కాలాన్ని సైతం వేసవి హరించేసింది. అప్పుడు ఏర్పడిన తీవ్ర వేడిమి వాతావరణాన్ని అసాధారణ రీతిలో ప్రభావితం చేసింది. ఆ తర్వాత కురిసిన వర్షాలు వాతావరణాన్ని దశల వారీగా కాకుండా ఒక్కసారిగా చల్లబరిచాయి. ఇటువంటి అసాధారణ వాతావరణ పరిస్థితులు వైరస్, బ్యాక్టీరియాల వ్యాప్తికి అత్యంత సానుకూలంగా ఉంటుంది. దీంతో కండ్లకలక వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి.

కేసులు పెరుగుతున్నాయి



కండ్లకలక కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ స్థితిని వైద్య పరిభాషలో పింక్ ఐ అంటారు. వైరస్ ప్రభావానికి ప్రత్యేకించి చికిత్స ఉండదు. అంటువ్యాధి కావడంతో ఐసోలేషన్ చాలా ముఖ్యం. కనీసం రెండు వారాల పాటు ఎక్కడకూ వెళ్లకుండా విశ్రాంతి తీసుకోవాలి. లక్షణాల ఆధారంగా మందులు ఇస్తాం. ఇన్ఫెక్షన్ పెరగకుండా యాంటీ బయాటిక్ డ్రాప్స్ వాడాలి. అది కూడా వైద్యుల సలహాతోనే. కండ్లకలక కారక ఎడినో వైరస్ సాధారణంగా తెల్లగుడ్డును ప్రభావితం చేస్తుంది. ఇన్ఫెక్షన్ తీవ్రతరమైతే నల్లగుడ్డుకూ వ్యాపిస్తుంది. ప్రమాదకరమైన ఈ స్థితిని ఎపిడిమిక్ కెరెటో కంజెక్టవైటిస్ అంటారు. ఇన్ఫెక్షన్ నల్లగుడ్డుకు వ్యాపిస్తే తీవ్రమైన నొప్పి కలిగి చూపు మందగించే అవకాశం కూడా ఉంటుంది.

– డాక్టర్ ఎస్.రమాభారతి, కంటి వైద్య విభాగాధిపతి, జీజీహెచ్, కాకినాడ

సొంత వైద్యం వద్దు

జిల్లాలో ఈమధ్య కండ్లకలక కేసులు అధికమయ్యాయి. నివారణకు చర్యలు చేపడుతున్నాం. వర్షాల కారణంగా నీటి వనరులు కలుషితమవుతున్నాయి. ఆ నీరు తాగితే కండ్లకలక వంటి ఇన్ఫెక్షన్లు తప్పవు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆరోగ్య కేంద్రాల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రజల్లో అజాగ్రత్త కూడా వ్యాప్తిని ఉధృతం చేస్తోంది. సొంత వైద్యం వద్దు. మందుల దుకాణాలకు వెళ్లి తీసుకునే కంటి చుక్కల్లో స్టెరాయిడ్స్ ఉంటే సమస్య జటిలమవుతుంది. రోజువారీ కేసులపై జిల్లా సర్వైలెన్స్ అధికారి ఆధ్వర్యాన పర్యవేక్షణ కొనసాగుతోంది. కండ్లకలక నివారణకు ఉపయోగించే యాంటీ బయాటిక్ డ్రాప్స్ అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనూ అవసరానికి తగిన స్థాయిలో ఉన్నాయి. జనసమూహాల్లో జాగ్రత్తగా ఉండాలి. విద్యాలయాలు, కార్యాలయాల్లో ఎక్కువ మందికి ఒకేసారి సోకితే తక్షణమే వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు తెలియజేయాలి.

– డాక్టర్ వెన్న పద్మ దీపిక, కంటి వైద్య నిపుణురాలు, ప్రాజెక్ట్ ఆఫీసర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కాకినాడ



కండ్లకలక బాధితుడి కంటిని పరీక్షిస్తున్న డాక్టర్ దీపిక

- మల్టీ విటమిన్లు, మల్టీ మినరల్స్, ట్రేస్ ఎలిమెంట్లు, యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు పుష్కలంగా ఉండే గింజలు, ఆకుకూరలు, పండ్లు తినడం మంచిది.

అపోహలు

- కండ్లకలక ఉన్న వారి కళ్లను చూస్తే ఈ వ్యాధి వస్తుందనుకోవడం పూర్తిగా అపోహ.
- వస్త్రాల్లోకి గాలి ఊది నోటి ఆవిరితో కాపడం పెట్టడం వలన ఇన్ఫెక్షన్ తీవ్రం కావచ్చు.
- మందులు వాడకూడదన్న ప్రచారం నిజం కాదు.
- బాధితులకు ఆహార నియమాలు, పత్యాలు ఏవీ లేవు.
- మాంసాహారం తినకూడదన్నది తప్పుడు ప్రచారమే. అంతకు ముందు అలర్జీ కలిగించని ప్రతి ఆహారం తీసుకోవచ్చు.
- సముద్రం చేపలు, రొయ్యలు తినకూడదనడం, దీనివలన కండ్లకలక పెరుగుతుందనడంలో ఎటువంటి శాస్త్రీయతా లేదు.

గురు సాక్షాత్ విద్యార్థి!

- ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ తరగతులు
- సమర్థ నాయకత్వం..అత్యున్నత విద్యా ప్రమాణాల పెంపుదలకు
- విజయవంతంగా రెండు దశల శిక్షణ పూర్తి
- నేటి నుంచి మూడో దశ


శిక్షణలో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న ప్రధానోపాధ్యాయులు

రాయవరం/గండేపల్లి: పాఠశాలలకు దిశానిర్దేశం చేసే ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు ఆవశ్యకం. అందుకే పాఠశాల విద్యాశాఖ వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ అందజేస్తోంది. రాష్ట్ర సమగ్ర శిక్షా ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు నేతృత్వంలో ఈ శిక్షణ ఇస్తారు. తొలుతగా జెడ్పీ ఉన్నత పాఠశాలలు, అనంతరం ప్రాథమికోన్నత, చివరగా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారి క్షేత్ర స్థాయిలో పాఠశాలల తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా అధికారులు గమనించిన అంశాల ఆధారంగా తొలుత ప్రధానోపాధ్యాయులకు లీడర్‌షిప్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ఇవ్వాలని

సమగ్రంగా..

స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్(సీమాట్) పర్యవేక్షణలో రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను ప్రధానోపాధ్యాయులు తీసుకుంటున్నారు. 12 అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. స్వీయ అవగాహన, స్వీయ నిర్వహణ, కమ్యూనికేషన్, ప్రభావాన్ని చూపడం, కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, అబ్జర్వేషన్ అండ్ ఫీడ్ బ్యాక్ అంశాలపై ఇంటరాక్టివ్, సెల్ఫ్ రిఫ్లక్షన్ మోడ్, పీర్ లెర్నింగ్, ఎక్స్‌పీరియన్స్‌డ్ లెర్నింగ్ తదితర విధానాల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు తరగతుల నిర్వహణతో పాటుగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందకరమైన విధానాల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం యోగా, ధ్యానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ట్రెనింగ్‌కు ముందు ప్రీ టెస్ట్, ట్రెనింగ్ అనంతరం పోస్ట్ టెస్ట్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు.

బ్యాచ్‌కు 300 మంది వంతున

2026 నాటికి పాఠశాల ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. గండేపల్లి మండలంలోని సూరంపాలెంలో ఉన్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాచ్‌కు 300 మంది వంతున శిక్షణ పొందుతున్నారు. పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం డివిజన్, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి, రెండవ దశ శిక్షణ పూర్తికాగా మూడవ దశ శిక్షణ సోమవారం నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

అర్థవంతమైన చర్చ సాగుతోంది



పాఠశాలలను అభివృద్ధి పర్చడానికి, రోల్‌మోడల్‌గా నిలిపేందుకు హెచ్‌ఎంలకు ఈ శిక్షణ ఉపకరిస్తుంది. సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి ఉపయోగిస్తుంది. శిక్షణలో అర్థవంతమైన చర్చ సాగుతోంది.
– జి.శ్రీనివాసరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల, మూలపేట, యు.కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా

ఇది ఉపయుక్తం



పాఠశాలను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుంది. పాఠశాలను విజయవంతంగా నిర్వహించడంలో సమర్థమైన నాయకత్వాన్ని పెంపొందించడానికి శిక్షణ ఉపయుక్తంగా ఉంటుంది.
– పీఎస్‌బీఎస్‌కే సుందరి, జీహెచ్‌ఎం, జెడ్పీ హెచ్‌ఎస్, హసన్‌బాద, రామచంద్రపురం మండలం, కోనసీమ జిల్లా

సవాళ్లను అధిగమించేలా..



ప్రధానోపాధ్యాయులుగా ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడానికి కూడా వీలుంది. అంతర్గతంగా శక్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు, ఆత్మ విశ్వాసం పెంచుకునేందుకు శిక్షణ ఉపయోగపడుతుంది.
– బి.రాజేశ్వరి, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, శాటిలైట్‌సిటీ, రాజమహేంద్రవరం రూరల్ మండలం, తూర్పుగోదావరి జిల్లా

సంతృప్తికరం



ఈ శిక్షణపై ప్రధానోపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న హెచ్‌ఎంలు పాఠశాలల్లో మరింత ప్రభావవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తారని ఆశిస్తున్నా.
– డాక్టర్ టి.మహమ్మద్ ఇస్మాయిల్,ట్రెనింగ్ సెంటర్ అబ్జర్వర్, సమగ్ర శిక్షా, విజయవాడ

క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

ఐ.పోలవరం: ఎదుర్లంక–యానాం వారధిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిళ్లు నడుపుతున్న ఇద్దరు చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మురమళ్ల నుంచి యానాం వైపు వస్తున్న మురమళ్లకు చెందిన ఉందుర్తి సుబ్రహ్మణ్యం, ఉందుర్తి బాల సుబ్రహ్మణ్యం.. యానాం నుంచి అమలాపురం వస్తున్న రాయపురెడ్డి శివ ఇద్దరు తమ మోటార్ సైకిళ్లతో యానాం–ఎదుర్లంక వారధిపై ఎదురెదురుగా ఢీకొనడంతో బలమైన గాయాలు అయ్యాయి. పోలీసులు 108లో అమలాపురం కిమ్స్‌కు తరలించారు. వీరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో వ్యక్తి బాల సుబ్రహ్మణ్యం చికిత్స పొందుతున్నాడు. దీనిపై ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటచేలో కుప్పకూలి కౌలు రైతు మృతి


వరిచేలో మృతి చెందిన శ్రీనివాస్ (ఫైల్)

తాళ్లరేవు: రోజూ మాదిరిగానే పంట చేలో పనిచేసుకుంటున్న కౌలు రైతు అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందిన ఘటన పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రాంటు గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్(45) శనివారం తోటి రైతులతో కలిసి వరి చేలో ఎరువులు జల్లుతున్న సమయంలో ఒక్కసారిగా ముందుకు కుప్పకూలి పడిపోయినట్లు తెలిపారు. స్థానికులు హుటాహుటిన యానాం జీజీహెచ్‌కు తరలించారు.

అప్పటికే కౌలు రైతు శ్రీనివాస్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. కౌలు రైతు శ్రీనివాస్ కొన్నేళ్లుగా సుమారు 10 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతునికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా, మరో కుమార్తె ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. కుటుంబ యాజమాని ఆకస్మికంగా మరణించడంతో అతని భార్య వాసంశెట్టి సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

నేటి నుంచి ఏపీఓ, ఏపీఎంలకు శిక్షణ

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలోని ఏపీఎంలు, ఏపీఓలు, కొంతమంది ఎంపీడీఓలకు సోమవారం నుంచి సెప్టెంబర్ 2 వరకు ఏడు బ్యాచ్‌లలో శిక్షణ ఇస్తామని కోర్సు డైరెక్టరు ఎంఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామరాజు, తూర్పు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదారి, ఏలూరు జిల్లాల్లోని 432కి శిక్షణ ఉంటుందన్నారు. ప్రతీ బ్యాచ్‌కు మూడురోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు.

వ్యక్తి అదృశ్యం

- గోదావరి ఒడ్డున చెప్పులు
- గాలింపు చేపట్టిన పోలీసులు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంకు చెందిన 41 ఏళ్ల ఇనపాల జార్జ్‌రాజు శనివారం నుంచి కనిపించడం లేదు. ఇతని చెప్పులు మాత్రం గోదావరి ఒడ్డున ఉన్నాయి. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. జార్జ్‌రాజు తన భార్య మల్లికతో కలిసి గోదావరిలో ఒడ్డుకు కొట్టుకువచ్చిన వంటచెరుకు తీసుకుని మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. భోజనం అనంతరం మళ్లీ కట్టెల కోసం వెళ్లుతున్నానని భార్యతో చెప్పి వెళ్లిన జార్జ్‌రాజు తిరిగి ఇంటికి రాలేదు. కుమారుడు సత్యేంద్ర సీతానగరం పోలీస్ స్టేషన్‌లో తన తండ్రి కనిపించడం లేదని ఆదివారం ఉదయం ఫిర్యాదు చేశాడు. ఎస్సై కె.చిరంజీవి, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు ఐదుగురు గజ ఈతగాళ్లతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. జార్జ్‌రాజు కట్టెలు ఏరుకునే క్రమంలో గోదావరిలో పడిపోయాడా? లేక ఎక్కడికైనా వెళ్లాడా? అనేది తెలియరాలేదు. ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో రాత్రి 7 గంటల వరకు గాలింపు జరిపినా జాడ తెలియలేదు. జార్జ్‌రాజుకు ఇద్దరు కుమారులు. కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు ఘటనా స్థలిని పరిశీలించారు.

మహేంద్రవాడలో వ్యక్తి దారుణ హత్య

- తెల్లారేసరికి శవమైన తాపీ మేస్త్రి
- తలవెనుక బలమైన గాయం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కిషోర్ కుమార్, సీఐ శ్రీనివాస్


నారాయణరెడ్డి (ఫైల్)

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడ శివారు తూర్పు పుంతలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అనపర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహేంద్రవాడ పాతపేటలో నివాసముంటున్న సత్తి నారాయణరెడ్డి(48)ని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. సమాచారం అందుకున్న సీఐ వి.శ్రీనివాస్, ఎస్సై పి.అప్పారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హతుడు కుడి మోచెయ్యి–మణికట్టు మధ్య విరిగి ఉండడంతోపాటు తల వెనుక భాగంలో బలమైన గాయం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు బలమైన ఆయుధంతో తలపై మోది హత్య చేసినట్లు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు అక్కడ మద్యం బాటిల్, వాటర్ ప్యాకెట్లు గుర్తించారు. హతుడితోపాటు మరి కొందరు మద్యం సేవించినట్లు అనుమానిస్తున్నారు. మండలంలోని కుతుకులూరుకు చెందిన నారాయణరెడ్డి 20 సంవత్సరాల క్రితం మహేంద్రవాడ వచ్చి స్థిరపడ్డాడు. తాపీమేస్త్రిగా జీవనం సాగిస్తున్న నారాయణరెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో నిర్వహించే తాపీ పని నిమిత్తం భవన కార్మికులతో మాట్లాడి వస్తానని భార్యకు చెప్పి శనివారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు ఆదివారం ఉదయం గ్రామ పరిధిలోని పుంతగట్టులో శవమై కనిపించాడు. రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.సురేష్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి హతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివాహేతర సంబంధం ఏదైనా హత్యకు దారితీసిందా? అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నారాయణరెడ్డి కాల్ డేటా ఆధారంగా ఎస్సై పి.అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు.

‘వేలంపాట’కు మంగళం

- రత్నగిరిపై పాత పద్ధతిలోనే పెళ్లిళ్లు
- వివాహ పురోహితుల వేలం పాట రద్దుకు ట్రస్ట్‌బోర్డు ఆమోదం
- ఈఓ చంద్రశేఖర్ అజాద్ వెల్లడి


రత్నగిరిపై వివాహాల కోలాహలం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పాత పద్ధతిలోనే పురోహితులు నిర్వహించవచ్చు. వివాహ పురోహితుల సంభావన హక్కు కోసం నిర్వహించ తలపెట్టిన వేలంపాటను పూర్తిగా రద్దు చేస్తూ ట్రస్ట్‌బోర్డు సమావేశంలో తీర్మానం ఆమోదించినట్టు ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 28న జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో దీనిపై చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేవస్థానంలో పురోహితులు ఎవరైనా గతంలో మాదిరిగానే వివాహాలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. అయితే వివాహం చేసుకునే వధూవరులు ఆధార్ కార్డు లేదా, వయసు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. పెళ్లి బృందాలను మధ్యవర్తులు, దళారీలు మోసం చేయకుండా గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివాహాలు చేయించే పురోహితులకు అసౌకర్యం కలుగకుండా చేస్తామన్నారు. అన్నవరం దేవస్థానం వ్రత పురోహిత సంఘ సభ్యులు, బయట ప్రాంతాల నుంచి వచ్చి వివాహాలు చేయించే పురోహితులు, పెళ్లిబృందాలు తమ వెంట తీసుకువచ్చే ఇంటి పురోహితులను సమన్వయం చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్య మతస్థుల వివాహాలు చేయించకుండా ఉండేందుకు గాను పురోహితుల గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు వివాహ సమయంలో దేవస్థానానికి సమర్పించాలని తెలిపారు. పురోహితులు గుర్తింపు విషయాన్ని దేవస్థానం వ్రత పురోహితులకు అప్పగించామన్నారు.

సింగిల్ విండో కొనసాగింపు

పెళ్లి బృందాల వారికి దేవస్థానం నిర్ణయించిన రుసుముకు సన్నాయి మేళం, భోజనాలు, రూమ్స్, పెళ్లి మంటపం కేటాయింపులో సింగిల్ విండో విధానం కొనసాగుతుందని ఈఓ వివరించారు. ఇందులో వివాదానికి తావు లేదని వివరించారు.

ఉత్తీర్ణతా శాతం పెరగాలి

- వార్డెన్లు వసతి గృహాల్లోనే ఉండాలి
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున


సమావేశంలో పాల్గొన్న మంత్రి నాగార్జున తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పాఠశాలలను ఆధుకీకరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఆదివారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయన జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి అంశాలపై శాఖాధికారులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో డాక్టర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని ప్రిన్సిపాల్స్ బాధ్యతాయుతంగా పనిచేస్తూ విద్యార్థులు ఉత్తీర్ణత నూరు శాతం ఉండేలా కృషి చేయాలన్నారు. పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు పూర్తిస్థాయిలో శిక్షణను అందించి పై తరగతులకు పంపించే విధంగా ఆయా రెసిడెన్షియల్ పాఠశాలల బాధ్యతలు తీసుకోవాలన్నారు. అవసరం మేరకు సబ్జెక్టుల వారీగా నిపుణులను సిద్ధం చేసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నారు. వార్డెన్‌లు హాస్టళ్లలోనే వుంటూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారులు కళాశాలలు వసతి గృహాలను పర్యవేక్షణ చేయాలన్నారు. వసతి గృహాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా చర్యలు చేపట్టాలని సోషల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలపై సమీక్షించారు. ఎస్సీ కార్పొరేషన్ సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం పటిష్టమైన చర్యలు చేపట్టి ఒక నెలలోగా పూర్తి స్థాయి నివేదికను సమర్పించాలని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయ పరిధిలో 35 వసతి గృహాలు ఉండగా, 30 ప్రభుత్వ భవనాల్లోనూ, 5 ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎం.సందీప్ మంత్రికి వివరించారు. జిల్లాలోని వసతి గృహాల్లో మొత్తం 40 మందికి గాను 32 మంది వార్డెన్లు విధులు నిర్వహిస్తున్నారని ఎనిమిది పోస్టులు భర్తీ చేయవలసి ఉందని చెప్పారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీత, అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థల కోఆర్డినేటర్, జి.రాజకుమారి పాల్గొన్నారు.

మూడు బైక్‌లపై నుంచి దూసుకుపోయిన కారు

నలుగురికి గాయాలు


బైక్‌లపైనుంచి దూసుకుపోయిన కారు

తాళ్లరేవు: అతివేగంగా వచ్చిన కారు మూడు బైక్‌లపై నుంచి దూసుకుపోవడంతో నలుగురు గాయాలపాలయ్యారు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపిన వివరాల మేరకు మట్లపాలెం నుంచి కాకినాడ వైపు వస్తున్న కారు గురజనాపల్లి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌లపైనుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో క్షతగాత్రులు, బైక్‌లు చెల్లా చెదురుగా పడడంతో స్థానికులు భీతావహులయ్యారు. తక్షణమే స్పందించిన స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను 108లో కాకినాడ తరలించగా చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరావు

దేవరపల్లి: మండలంలోని బందపురం వద్ద హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జంగారెడ్డిగూడెం మండలం కేతవరానికి చెందిన ప్రత్తిపాటి నాగేశ్వరరావు(59) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం కేతవరానికి చెందిన నాగేశ్వరరావు, దినేష్ మోపెడ్‌పై రాజమహేంద్రవరం వైపు వెళుతున్నారు. బందపురం వద్ద విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు మోపెడ్‌ను ఢీకొంది.నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా, దినేష్ తీవ్రంగా గాయపడ్డాడు. కారులో ప్రయాణిస్తున్న తుళ్లూరి అమృతవర్షిణి, రెండేళ్ల బాలుడు సాయిస్కంద్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

మృతుడి కుటుంబీకుల ఆందోళన


హెరిటేజ్ ఫ్యాక్టరీ ఎదుట బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

కె.గంగవరం: కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంపన మల్లేశ్వరరావు మృతి చెందగా, అతని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ పామర్రులో హెరిటేజ్ పాల ఫ్యాక్టరీ వద్ద బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం నిరసన తెలిపారు. హెరిటేజ్‌కు చెందిన పాల వాహనం ఢీకొట్టడంతోనే మల్లేశ్వరరావు మృతి చెందాడని, అతని కుటుంబానికి న్యాయం చేయాలని ఫ్యాక్టరీ ఎదుట బైఠాయించారు. పాల వాహనాలకు చెందిన కాంట్రాక్టర్ బాధిత కుటుంబ సభ్యులకు మధ్య కొంతసేపు చర్చలు జరిగాయి. ఈ చర్చలు సఫలం కావడంతో కుటుంబ సభ్యులు నిరసన విరమించారు. బాధిత కుటుంబానికి రూ.1.50 లక్షలు ఇచ్చేందుకు, బీమా క్లైయిమ్ చేసుకునేలా సంబంధిత కాంట్రాక్టర్ అంగీకరించారు.

ప్రైవేటు బస్సులో ప్రయాణికుల ఇక్కట్లు

విసుగుచెంది సీట్లకు నిప్పు పెట్టిన వైనం


మల్లేపల్లి శివారులో నిలిచిన ప్రైవేటు బస్సు. చిత్రంలో ప్రయాణికులు నిప్పు పెట్టిన సీట్లు

గండేపల్లి: గమ్యస్థానానికి వెళ్లేందుకు ఓర్పుతో సమయం గడుపుతూ ప్రయాణం సాగిస్తుండగా మార్గ మధ్యలో వారు ప్రయాణిస్తున్న బస్సు తరచు మరమ్మతులతో ఆగిపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు యాజమాన్యం స్పందించకపోవడంతో ఆగ్రహించి బస్సు సీట్లను రోడ్డుపై వేసి నిప్పుపెట్టారు. ఈ ఘటన గండేపల్లి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు విశాఖ వెళ్లేందుకు హైదరాబాద్‌లో ఎస్‌వీఎస్ ట్రావెల్ బస్సులో శనివారం రాత్రి 11.20 గంటలకు ఐదుగురు మహిళలు, ఐదేళ్ల పాపతో సుమారు 26 మంది ప్రయాణికులు బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజాము సుమారు 3.30 గంటల ప్రాంతంలో కోదాడ వద్దకు వచ్చేసరికి బస్సు ఇంజన్ వేడెక్కి మూడు గంటల పాటు నిలిచిపోయింది. ఆదివారం ఉదయం 6.30 గంటలకు ప్రయాణం ప్రారంభించిన బస్సు నల్లజర్ల వచ్చేసరికి 9.30 గంటలకు మరోసారి పాడైంది. మరికొంత సమయం దాటాక ప్రయాణం ప్రారంభించిన బస్సు రాజమహేంద్రవరం బ్రిడ్జి దాటుతుండగా మళ్లీ నిలిచిపోయింది. మధ్యాహ్నం 1.30 గంటలకు మండలంలోని మురారి శివారు హోటల్స్ వద్ద వచ్చేసరికి బస్సు మరోసారి ఆగిపోవడంతో అప్పటికే ఆకలితో ఉన్న ప్రయాణికులు అక్కడే భోజనాలు చేశారు. మరి కొంత సమయం తర్వాత బయలుదేరిన బస్సు మల్లేపల్లి శివారు కరుణకుమార్ దాబా వద్దకు వచ్చేసరికి మరోసారి ఆగిపోయింది.

శనివారం రాత్రి బయలు దేరిన బస్సు తెల్లవారేసరికి విశాఖ చేరుకోవాల్సి ఉండగా మార్గ మధ్యలో పలుమార్లు ఆగిపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డామని ప్రయాణికులు చెప్పారు. నెలల శిశువుతో ప్రయాణిస్తున్న ఒక మహిళ ఎంతో యాతన పడిందని, కనీసం పాలు కూడా అందుబాటులో లేకపోవడంతో ఆకలితో ఆ బిడ్డ గుక్కపెట్టి ఏడ్వటంతో చాలా బాధ అనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు యాజమాన్యం సరిగా స్పందించలేదని, మీ టిక్కెట్ సొమ్ములో ఒక్కొక్కరికి రూ.200 మాత్రమే ఇస్తాం అని చెప్పడంతో విశాఖ వరకు వెళ్లడానికి సొమ్ము సరిపోదని ప్రయాణికులు చెప్పినప్పటికీ మీ ఇష్టానుసారం చేసుకోండని బదులివ్వడంతో ఆగ్రహించిన ప్రయాణికులు బస్సులోని సీట్లను హైవేపై వేసి నిప్పు పెట్టారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనాస్థలంకు చేరుకుని ప్రయాణికులతో మాట్లాడి వేర్వేరు బస్సుల్లో పంపించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా బస్సు బయలుదేరడానికి రెండు రోజుల ముందు మరమ్మతులు చేయించామని, మార్గమధ్యలో ఈ విధంగా జరిగిందని, కొంతమంది ప్రయాణికులకు సొమ్ము ఇచ్చామని బస్సు క్లీనర్ విశ్వంత్ పేర్కొన్నాడు.

దుర్మరణం


ప్రమాద స్థలిలో శ్రీను మృతదేహం

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. అనపర్తి ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. గ్రామానికి చెందిన బి.శ్రీను(49), బి.దుర్గాప్రసాద్ ఆదివారం వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై అనపర్తి బయలుదేరారు. గ్రామ పరిధిలో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఇదే సమయంలో గ్రావెల్ లోడుతో రాజానగరం వైపు నుంచి అనపర్తి వైపు వస్తున్న టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న శ్రీను రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న అనపర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

నదిలోకి దూకి యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన రాఘవేంద్ర

తాళ్లరేవు: కోరంగి వంతెనపై నుంచి దూకి అంగాడి రాఘవేంద్ర(24) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు మండలం మత్స్యకార గ్రామానికి చెందిన రాఘవేంద్ర ఈ నెల 28వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. ఈ నేపథ్యంలో అతని తల్లిదండ్రులు కోరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేశారు. ఇలా ఉండగా గుర్తు తెలియని యువకుడు కోరంగి వంతెనపై నుంచి శనివారం దూకినట్లు సమాచారం అందడంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాఘవేంద్ర మృతదేహం ఆదివారం లభ్యమవడంతో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.